క్లుప్తంగా

సేవా కార్యక్రమాల్లో మేటి

భద్రాచలంటౌన్: గత రెండేళ్లుగా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్ తెలిపారు. స్థానిక జీయర్ మఠంలో ఆదివారం జిల్లా నాలుగవ కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జిల్లాలోని పేద విద్యార్థులకు ఆర్థిక సహాయంతో పాటు భద్రాద్రిలో నిర్వహించిన ముక్కోటి మహోత్సవాలకు వచ్చే భక్తులకు మజ్జిగ, బిస్కెట్లు, మంచి నీరు అందించడం జరిగిందన్నారు. జిల్లాని ప్రతి మండలంలో మహాత్మ గాంధీ, పొట్టి శ్రీరాములు వర్ధంతి, జయంతి వేడులకు నిర్వహించే విధంగా ఆర్య వైశ్య మహాసభ సభ్యులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో దోసపాటి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, వినోద్‌కుమార్, రామచంద్రరావు, వెంకటనాగభూషణం, సత్య నారాయణ, గోపాలకృష్ణ, నగేష్ కుమార్, అనిల్ కుమార్, సంతోష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని మొక్కు


జగన్ గెలవాలని గడ్డం పెంచిన సాంబ

చండ్రుగొండ: వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో అధికారం లోకి రావాలని, జగనన్న మళ్లీ సీఎం పదవి చేపట్టాలని చండ్రుగొండ పంచాయతీ శివారు ఇమ్మడి రామయ్య బంజర్‌కు చెందిన నాలి సాంబ కనకదుర్గమ్మకు మొక్కుకున్నాడు. వైఎస్ఆర్ కుటుంబానికి వీరాభిమాని అయిన ఇతడు.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ వర్ధంతితోపాటు జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ప్రతిఏటా తన సొంత డబ్బులతో ఘనంగా జరిపిస్తాడు. భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి పూలమాలలు వేస్తాడు. జగన్ పుట్టిన రోజు కేక్‌లు కట్‌చేసి తన అభిమానం చాటుకుంటాడు. త్వరలో ఏపీలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో జగనన్న సీఎం పదవి చేపట్టిన తరువాతనే విజయవాడలోని కనకదుర్గమ్మ దేవత వద్ద తన గడ్డం మొక్కుతీర్చుకుంటానని అతడు సాక్షితో చెప్పాడు.

ములకలపల్లిలో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో ముస్లింలు

ములకలపల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ మసీద్‌లో ముస్లింలకు ఆదివారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్థానికులు నకిరకంటి కొండల్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. ముస్లిం మతపెద్దలు, స్థానిక ముస్లింలు హాజరయ్యారు.

పాఠశాలలో అన్నదానం


విద్యార్థులకు అన్నదానం నిర్వహిస్తున్న దాతలు

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగరలోని బాలవెలుగు పాఠశాలలో సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా కేసిహెచ్‌పీ కన్వేయర్ ఆపరేటర్ బి.శ్రీనివాస్–లక్ష్మీప్రసన్న దంపతుల కుమార్తె షణ్ముఖప్రియ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సమక్షంలో షణ్ముఖప్రియ కేక్ కట్ చేసి పంపిణీ చేసింది. అనంతరం విద్యార్థులకు సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు బి.జగన్మోహన్‌రెడ్డి, సేవా సమితి సభ్యులు మంగీలాల్, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పి.దుర్గాదేవి, పి.శివదుర్గ, పి.అర్జున్, గౌతమ్, నవ్యదేవి తదితరులు పాల్గొన్నారు.

నగదు, నిత్యావసరాలు వితరణ

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేట గ్రామ శివారులోని మల్లారం కాలనీలో నివసిస్తున్న నిరుపేద అయిన దాగం రామాచారి కుటుంబానికి రూ.5 వేల నగదును, నిత్యావసరాలను వితరణగా అందజేశారు. మల్లారం కాలనీకు చెందిన రామాచారి కుటుంబం, కడు పేదరికంలో జీవిస్తుండగా అతడికి మతిస్థిమితం లేని భార్య, ముగ్గురు కూమర్తెలు ఉన్నారు. విషయం తెలిసిన పాల్వంచ పట్టణానికి చెందిన అంజిచారి ఆదివారం ఆ కుటుంబానికి వితరణగా అందజేశారు. కార్యక్రమంలో రామదుగు రామాచారి, కోడురు నాగేశ్వరరావు, దాసరోజు రామారావు పాల్గొన్నారు.

మృత్యుంజయుడికి ఆరాధన

- భక్తి శ్రద్ధలతో క్రైస్తవుల ప్రార్థనలు
- ఈస్టర్‌ను పురస్కరించుకుని వేడుకలు


దమ్మపేట: నాగుపల్లిలో ఈస్టర్ వేడుకల్లో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ


మణుగూరుటౌన్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

దుమ్ముగూడెం: మండలంలోని పలు చర్చిలలో ఈస్టర్ సందర్భంగా ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మానవాళి పాపపరిహారార్థం క్రీస్తు సిలువలో యాగమై మూడవ దినమైన ఆదివారం పునరుత్థానుడవడాన్ని పురస్కరించుకుని క్రైస్తవులందరూ ఈస్టర్ జరుపుకున్నారు. క్రీస్తును ఘనంగా ఆరాధించారు. కేయిన్‌పేటలోని జరిగిన ఆరాధనలో ఆంధ్ర దేవాలయం కమిటీ మెంబర్స్ జి.కిషోర్, డి.రాజేష్ రావు, జి.రమా వరకుమారి, చైర్మన్ రెవరెండ్ యోహాను తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో ర్యాలీ..

మణుగూరుటౌన్: పట్టణంలో ఈస్టర్‌ను పురస్కరించుకుని మణుగూరు మండల యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ (ఎంఎంయూసీఏ) ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు యేసు నామాన్ని స్మరిస్తూ గీతాలను ఆలపించారు. మణుగూరు పట్టణ రక్షణను కాంక్షిస్తూ సురక్షా బస్‌స్టాండ్ నుంచి బస్ డిపో వరకు కాలి నడకన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ విజ్ఞాన్‌రావు, వైస్ ప్రెసిడెంట్ శ్యాం, జనరల్ సెక్రటరీ జేమ్స్, జాయింట్ సెక్రటరీ శ్యామ్యుల్ రాజ్, ట్రెజరర్ నెహమ్యా, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ కరుణాకర్, జగదీశ్, యనోష్‌పాల్, దైవజనులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దమ్మపేట: మండల పరిధిలోని నాగుపల్లి గ్రామంలోని క్రీస్తు కృప ప్రార్థన మందిరంలో ఆదివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రార్థనలు చేశారు. ఈస్టర్‌ను పురస్కరించుకుని నిర్వాహకుల ఆహ్వానం మేరకు పండుగ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. చర్చిలో క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపి, క్రీస్తుకు నిర్వహించిన ప్రార్థనలో పాల్గొని దేవుడి నామమును స్తుతించారు. కార్యక్రమంలో స్థానిక పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ఈస్టర్ వేడుకలను ప్రార్థనా మందిరాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని రామన్నగూడెం, దిబ్బగూడెం, తాటి నాగులగుంపు, అల్లిగూడెం, ఊట్లపల్లి, వినాయకపురం, వినాయకపురం కాలనీ, అనంతారం, గాండ్లగూడెం, మల్లాయిగూడెం, నారాయణపురం, నారాయణపురం కాలనీ, మామిళ్లవారిగూడెం, తిరుమలకుంట, ఆసుపాక, నందిపాడు, అశ్వారావుపేటలోని పలు చర్చిల్లో పాస్టర్లు క్రైస్తవులకు ప్రత్యేక సందేశాన్ని ఇచ్చి, భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. సిలువ వేసిన అనంతరం క్రీస్తు మృత్యువుని జయించడాన్ని పురస్కరించుకొని ప్రత్యేక గీతాలను అలపించారు. ఈ కార్యక్రమాల్లో పాస్టర్లు సియోను కుమార్, రాందాస్, నెహ్రు, ప్రభుదాస్, జైపాల్, నారం కిషోర్, రమేష్, సుధాకర్, దివ్య జ్యోతి, ఏస్తేరు రాణి, సువార్త కుమారి, డేవిడ్, విశ్వాసులు పాల్గొన్నారు.


దుమ్ముగూడెం: కేయిన్‌పేట చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న సంఘస్తులు


అశ్వారావుపేటరూరల్: ఈస్టర్ డే కీర్తనలు ఆలపిస్తున్న విశ్వాసులు

దేశ అభ్యున్నతిలో ఉపాధ్యాయులే కీలకం

బూర్గంపాడు: దేశ అభ్యున్నతిలో ఉపాధ్యాయులే కీలకమని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత అన్నారు. మోరంపల్లిబంజర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ్రు వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వృత్తిపట్ల అంకితభావంతో పనిచేసి వందలాదిమంది విద్యార్థుల అభ్యున్నతికి కొండ్రు వెంకటేశ్వర్లు విశేష కృషి చేశారన్నారు.ఆయన వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు నేడు ఎంతో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తితో పాటుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొని ప్రజల ఆదరాభిమానాలను పొందారన్నారు. ఈ సందర్భంగా కొండ్రు వెంకటేశ్వర్లు దంపతులను స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు.


హెచ్‌ఎం వెంకటేశ్వర్లు దంపతులను సన్మానిస్తున్న జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత

మండలంలో ఎమ్మెల్యే పర్యటన


నాగుపల్లిలో బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట: మండలంలో సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అందులో భాగంగా నాగుపల్లి, ఆసన్నగూడెం గ్రామాల్లో ఇటీవలే అనారోగ్యంతో మరణించిన వారి చిత్రపటాలకు పూలతో నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అవే గ్రామాల్లో ఇటీవలే ప్రమాదంలో గాయపడి, అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోత

దుమ్ముగూడెం: మండలంలోని నరసాపురం ఫీడర్, లచ్చిగూడెం సబ్ స్టేషన్, దుమ్ముగూడెం ఫీడర్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా విషయంలో సోమవారం రోజున అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ అధికారి మోహన్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ ఇంప్రూమెంట్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి సామర్థ్యం పెంపుదలకు పనులను నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 02 గంట సమయం నుంచి సాయంత్రం 04 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. మండలంలోని నరసాపురం ఫీడర్, లచ్చిగూడెం సబ్ స్టేషన్, దుమ్ముగూడెం ఫీడర్ పరిధిలోని గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చండ్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. సంఘటన వివరాలిలా ఉన్నాయి.. కొత్తగూడెం నుంచి చండ్రుగొండ వస్తున్న ఆటోను వీఎం బంజర్ నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున కారు తిప్పనపల్లి వద్ద వేగంగా వచ్చి ఢీకుంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న రామవరానికి చెందిన కె.కుమార్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం జగదీష్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు ఆదివారం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలోనే కాలనీలో పర్యటించి కాలనీలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా సంబంధిత అధికారులకు సూచిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆకోజు సునీల్, రామకృష్ణ, లక్ష్మణ్‌రెడ్డి, కరీం పాల్గొన్నారు.


ఎమ్మెల్యే తెల్లంకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

డాక్టర్ సేవలు మరువలేనివి..


డాక్టర్ తిరుపతిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మణుగూరురూరల్: ఇటీవల అనారోగ్యంతో మరణించిన పట్టణ వైద్యుడు డాక్టర్ తిరుపతిరావు సేవలు అజరామరమని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య, సీపీఎం సీనియర్ నాయకుడు అల్లూరి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం కిన్నెర కల్యాణ మండపంలో సీపీఎం ఆధ్వర్యంలో డాక్టర్ తిరుపతిరావు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 40 ఏళ్లుగా డాక్టర్ తిరుపతిరావు ఈ ప్రాంత ప్రజలకు విశిష్ట సేవలు అందించారని, ఎంతోమందికి ఉచితంగా వైద్యం చేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ తిరుపతిరావు అని కొనియాడారు. రాత్రి సమయాల్లో సైతం అందుబాటులో ఉంటూ తలుపు తడిచే చాలు ప్రజలకు వైద్యసేవలు అందించేవారన్నారు. డాక్టర్ తిరుపతిరావు మరణించినా.. ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. అలాంటి వైద్యుడు ఈనాడు మరణించడం తీవ్ర బాధాకరమని, దురదృష్టకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు తామంతా అండగా ఉన్నామని భరోసా కల్పించారు. అనంతరం నాయకులు డాక్టర్ తిరుపతిరావు చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళ్లర్పించారు. అనంతరం డాక్టర్ తిరుపతిరావు దశదిన కర్మలకు హాజరై కుటుం సభ్యులను పరామర్శించారు. కాగా, ఇదే కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాజారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనర్సారెడ్డి, టీడీపీ నేత వాసిరెడ్డి చలపతిరావు, కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ కాటిబోయిన నాగేశ్వరరావులు తిరుపతిరావు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా మహిళా సమైఖ్య కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి ఆర్ లక్ష్మీనారాయణ, పార్టీ పట్టణ కార్యదర్శి డి.సుధాకర్, నాయకులు ఎడారి రమేష్, ఎంపీటీసీ కామిశెట్టి రామారావు, సోందె కుటుంబరావు, జక్కుల రాజబాబు, సీపీఎం మండల కార్యదర్శి కొడిశాల రాములు, నర్సింహారావు, లెనిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు ఆదర్శంగా ఉండాలి

అశ్వాపురం: ఆదివాసీ మనుగడ అభివృద్ధి, సంస్కృతి సంప్రదాయాలకు అశ్వాపురం ఆదివాసీ జాక్ కమిటీ ఆదర్శప్రాయం కావాలని ఆదివాసీ జేఏసీ నాయకులు అన్నారు. ఆదివారం ఆదివాసీ జాక్ పిలుపు మేరకు జేఏసీ అధ్యక్షుడు కుంజా రామారావు అధ్యక్షతన మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీ చట్టాలకు భద్రత చేపట్టాలని, జాతి మనుగడ, అభివృద్ధి, సంస్కృతి సంప్రదాయాలకు అశ్వాపురం ఆదివాసీ జాక్ కమిటీ జిల్లాలోని ఆదివాసులకు ఆదర్శప్రాయం కావాలని అన్నారు. అదేవిధంగా ఆదివాసీ చట్టాలు, పెసా సిద్ధాంతాలు తెలిపే విధంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పొడియం అనిల్, తుడుం దెబ్బ జిల్లా నాయకులు తంగెళ్ల భద్రయ్య, ఆదివాసీ నాయకులు బొడిక వెంకటేశ్వర్లు, కుంజా రామారావు, బట్టా సత్యనారాయణ, బీజేపీ పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పొడియం బాలరాజు, కుంజా అనిల్, తోకల చంద్రశేఖర్, సపక నరేశ్, కల్లూరి నరసింహారావు, తెల్లం శ్రీను, ఇర్ప లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

ప్రత్యేక టెట్ నిర్వహించాలి

భద్రాచలంటౌన్: రాష్ట్రంలో ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సాధారణ టెట్ కాకుండా ప్రత్యేక టెట్ నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక టీఎస్‌యూటీఎఫ్ ప్రాతీయ కార్యాలయంలో కన్వీనర్ టీవీస్ ప్రసాద్ అధ్యక్షతన యూటీఎఫ్ సీనియర్ నాయకుడు అప్పారి వెంకటస్వామి వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పారి వెంకటస్వామి ఉపాధ్యాయులకు, సంఘానికి చేసిన కృషిని గుర్తు చేయడంతో పాటు ఆయనను ప్రతి ఉపాధ్యాయుడు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరానికి సకాలంలో పుస్తకాలు, బట్టలు అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మురళీమోహన్, లక్ష్మీనారాయణ, అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి


మాట్లాడుతున్న ముదిగొండ రాంబాబు

ములకలపల్లి: మండలకేంద్రంలో ఆర్‌అండ్‌బీ పరిధిలోని ఆక్రమణలు తొలగించాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన లెఫ్ట్ పార్టీల ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు నూపా భాస్కర్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి నరాటి రమేశ్‌లు మాట్లాడారు. ములకలపల్లిలో ఆర్‌అండ్‌బీ స్థలాలను అక్రమంగా ఆక్రమించి భవనాలు నిర్మించిన అతికొద్దిమంది, చిరువ్యాపారుల పేరుతో రోడ్డు విస్తరణకు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఆక్రమణదారులకు మద్దతిస్తున్న వారిపై ఖరిని మానవతావాదులందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఆర్‌అండ్‌బీ నియమ నిబంధనల మేరకు రోడ్డు విస్తరణ చేపట్టాలన్నారు. అభివృద్ధికి అండగా నిలుస్తున్న వామపక్ష పార్టీలపై కొందరు దుష్ప్రచారానికి పాల్పడడం సరికాదని అన్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా 50మేర విస్తరణ చేపట్టాలని, అప్పటి వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. సమావేశంలో వామపక్ష పార్టీల నాయకులు కల్లూరి కిషోర్, ఊకంటి రవికుమార్, అనుమల సాయి, నిమ్మల మధు, గద్దం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన

దుమ్ముగూడెం: మండలంలోని నడికుడి గ్రామంలో షష్టి ఆదివారం నాడు దేవర బాల నర్సింహారావు ఇంటి వద్ద ఉన్న నాగులమ్మ అమ్మవారి దేవాలయంలో గ్రామస్తులు సోయం ముది రాజు, రాజేశ్వరి దంపతులు నాగ దోష పరిహారార్థం నాగ దేవత విగ్రహం ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు.

అర్చకులు రాఘవశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాక వెంకటేశ్వరరావు, గ్రామస్తులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.


ప్రతిష్ఠ కార్యక్రమాల్లో అర్చకులు

'నవోదయ'కు ఎంపిక


గాయత్రి

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని కిడ్స్ క్యాప్టివేషన్ పాఠశాలకు చెందిన పూనెం గాయత్రి నవోదయకు ఎంపికైంది. 2023 జూన్ నుంచి పాఠశాలలో నవోదయ పరీక్షకు ప్రత్యేక శిక్షణ తీసుకుని పరీక్ష రాసి ఉత్తీర్ణురాలైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు 80 సీట్లు కేటాయించగా అందులో గాయత్రి ఉత్తీర్ణురాలు కావడంపై విద్యార్థిని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నవోదయ పరీక్షల్లో ఉత్తీర్ణురాలు అయిన గాయత్రిని పాఠశాల ప్రిన్సిపాల్ మజ్జి శ్రీనివాసరెడ్డి, అధ్యాపకురాలు వేముల నాగకావ్యలు ప్రత్యేకంగా అభినందించారు.

భానుడి భగ భగలు!

- క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం 9 గంటల నుంచే వడగాల్పులు
- ఉక్కపోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదమే..



మండలంలో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతల పట్ల ప్రజలు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాల బారిన పడినట్లే. ప్రస్తుతం వీస్తున్న వడగాలులు, అధిక వేడికి ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలి. అధిక వేడి నుంచి ఉపశమనం పొందేందుకు, డీ హైడ్రేషన్ కాకుండా శరీరంలో నీటి శాతం ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. చల్లని మజ్జిగ, కొబ్బరిబొండాలు, శీతల పానీయాలు ఎక్కువగా తీసుకోవాలి. వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యానికి తగు జాగ్రత్తలు, సూచనలు పాటించాలి.

– డాక్టర్ సునీల్, సూపరింటెండెంట్, మణుగూరు ఏరియా ఆస్పత్రి

మణుగూరురూరల్: భానుడు భగభగమంటూ తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా పగడి ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తున్నాయి. మార్చిలోనే సూర్యుడు తన ప్రభావాన్ని ఇంతగా చూపిస్తుంటే.. వచ్చే ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మండలంలో ఉదయం 9గంటల నుంచే వేడి వాతావరణం చలామణి అవుతోంది. మధ్యాహ్న సమయంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావాలంటేనే భయపడుతున్నారు. ప్రధానంగా ఈ అధిక ఉష్ణోగ్రతలను పిల్లలు, వృద్ధులు తట్టుకోలేని పరిస్థితి. రోజూ 28–40 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఉక్కపోతలు ఉక్కిరిబిక్కిరి అవుతూ అనారోగ్యాల పాలవుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు ఫ్యాన్ గాలి సరిపోకపోవడంతో ఇళ్లల్లోని కూలర్లను శుభ్రం చేసి వాడుకోవడం, కొత్త కూలర్లను కొనుగోలు చేస్తున్నారు. వీటికి తోడు ఏసీల వినియోగం ఎక్కువైంది. కూలర్లు, ఏసీలను కొనుగోలు చేయలేని వారు వేడి, ఉక్కపోతలతో అష్టకష్టాలు పడుతున్నారు. వేసవి తాపం నుండి ఉపశమనం పొందేందుకు ఎక్కువగా శీతల పానీయాలు, తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ వేసవి ఎండల నుంచి ఉపశమనం పొందాలంటే తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. లేదంటే డీహైడ్రేషన్ వంటి అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఈ వేసవిలో వదులుగా ఉండే దుస్తులను ధరించాలని సూచిస్తున్నారు. ఎండలో ప్రయాణించేవారు గొడుగు, హెల్మెట్ వంటి వినియగించడం, సన్‌స్క్రీన్ లోషన్స్ వాడడం మంచిది. ప్రతీ రోజూ తీసుకునే ఆహారంలో తగిన ఉప్పు, నీరు, పోషక విలువలు ఉండేలా చూసుకోవాలి.